క్లుప్తంగా

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పౌష్టికాహారం తయారీపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ చిట్టెమ్మ

బనగానపల్లెరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ చిట్టెమ్మ తెలిపారు. మండలంలోని చెర్లోకొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం జరిగింది. కూరగాయాలు, ఆకు కూరలతో పౌష్టికాహారం తయారు చేసుకునే విధానంపై ఆమె అవగాహన కల్పించారు.అంగన్‌వాడీ వర్కర్లు సుమలత,రోజారమణి,లక్ష్మీనారాయణమ్మ గర్భిణి,బాలింత మహిళలు పాల్గొన్నారు.

సన్మానం



బాలసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొలిమిగుండ్ల: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలసుబ్బారెడ్డిని మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయుల బృందం ఘనంగా సన్మానించింది. బాలసుబ్బారెడ్డిని సెప్టెంబర్ 5న విశాఖపట్నంలో అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఉపాధ్యాయులు, సిబ్బంది పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు.

పశువైద్యశాలలో గేదెకు అరుదైన చికిత్స



గేదెకు చికిత్స చేస్తున్న ఏడీఏ మారుతిసకారామ్, పశువైద్యులు

బనగానపల్లెరూరల్: బనగానపల్లె పశువైద్యశాలలో ఓ గేదెకు అరుదైన శస్త్రచికిత్సతో కడుపులో మృతి చెందిన దూడను తీశారు. ఏడీఏ డాక్టర్ మారుతిసకారామ్ ఆధ్వర్యంలో మంగళవారం ఈ ఆపరేషన్ జరిగింది. పట్టణానికి చెందిన రైతు పుల్లయ్య గేదె నెల రోజుల క్రితం దూడకు జన్మనిచ్చింది. గేదె ఆరోగ్య సక్రమంగా లేకపోవడంతో పుల్లయ్య పశువైద్యశాలకు తీసుకువచ్చారు. గేదెను పరిశీలించిన ఏడీఏ కడుపులో మారో దూడ మృతి చెంది ఉండడతో ఇన్‌ఫెక్షన్ అయ్యిందని గుర్తించారు. ఏడీఏతో పాటు పశువైద్యులు డాక్టర్ రామ్ కుమార్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ రాఘవేంద్రరెడ్డి, చిన్నబాబు, శ్రీకాంత్‌రెడ్డి భారతిదేవి, తస్లీమా రెండు గంటల పాటు శ్రమించి గేదెకు ఆపేరేషన్ చేసి కుళ్లిన దూడను బయటికి తీశారు. ప్రస్తుతం గేదె ఆరోగ్యం ఉందని వైద్యులు తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

డోన్ రూరల్ : విద్యార్థులు చదువులతో పాటు క్రీడలలో రాణించాలని మాజీ ఎంపీటీసీ బద్దల నాగరాజు, గ్రామ ఉప సర్పంచ్ రాజేశ్వరరెడ్డి సూచించారు. మండల పరిధిలోని చిన్నమల్కాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం యూ. సత్యనారాయణ, డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బి.సుధాకర్ ఆధ్వర్యంలో బాల, బాలికలకు నిర్వహించిన అండర్ 17, 14 క్రీడా సెలక్షన్ పోటీలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహనందరెడ్డి, మండల కోఆర్డినేటర్ శ్రీనివాసులు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ జీ సత్యనారాయణ, పీఈటీలు దాస్, నగేష్, రామకృష్ణ, మధు, లక్ష్మణ్, మనోహర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

డోన్ టౌన్ : ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాద రహిత సమాజం కోసం పాటుపడినవారవుతారని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో ఎస్ఐలు శరత్‌కుమార్ రెడ్డి, సుధాకర్‌రెడ్డిలతో కలిసి కంబాలపాడు సర్కిల్, పాత బస్టాండ్, స్టేట్ బ్యాంక్ తదితర కూడళ్లలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆటోల డ్రైవర్లకు సీఐ పలు సూచనలు సలహాలు చేశారు. ప్రత ఇవాహనానికి తప్పని సరిగా రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. అదేవిధంగా డ్రైవరుకు డ్రైవింగ్ లైసెన్సు తప్పని సరిగా ఉండాలని, అప్పుడే బీమా వర్తిస్తుందన్నారు. వాహనాలను తనిఖీ చేసి రికార్డులు సరిగా లేని వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గోపాల్, హెచ్‌సీలు ఓబులేసు, వెంకటనారాయణ, చాంద్‌బాషా, రెడ్డి, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించండి

- ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదు
- మండల మీట్‌లో హెచ్చరించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

అవుకు: ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కార చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. కొందరు అధికారులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పద్ధతులు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పురోగతులను అడిగి తెలుసుకున్నారు. చెన్నంపల్లె గ్రామంలో ప్రజలకు తాగునీరు అందించే పైప్‌లైన్ ద్వారా కొందరు సాగునీటిగా వాడుకుంటుంటే ఏమీ చేస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిపై మండిపడ్డారు. రైతులు ఏ విధంగా నష్టపోకుండా ఆదుకునేందుకు ప్రభుత్వం పాటుపడుతుంటే క్రాప్ డ్యామేజ్‌ను సరిగా నమోదు చేయకపోవడం సమంజసం కాదని, అధికారుల నిర్లక్ష్యం మూలంగా రైతులకు నష్టపోవాల్సి వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. అదేవిధంగా అవుకు రిజర్వాయర్ స్పిల్ వే గేట్లు లీకేజీతో నీరు వృథాగా పోతుందని, దీంతో పంటలు దెబ్బతింటున్నా ఎందకు పరిష్కార చర్యలు చేపట్టడం లేదని ఎస్సార్బీసీ అధికారిని నిలదీశారు. నియోజవర్గంలో మూడు మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల రిపేర్లు, నూతన భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయని, అవుకు మండలానికి సంబంధించి కనీసం నివేదికలు ఎందుకు పంపలేదని ఐసీడీఎస్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పశువైద్యశాలల్లో రిపేర్లు, టాయిలెట్, కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి డీఎమ్ఎఫ్ నిధులు మంజూరయ్యాయని, పనులు ప్రారంభం కావడంలేదని అవుకు పశువైద్యాధికారి భారతీదేవి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామప్ప, కోఆప్షన్ మెంబర్ ఉసేన్‌మియా, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాసులు, డాక్టర్లు భారతీదేవి, రవికుమార్, వినోద్ కుమార్, ఏఈలు కరిముల్లా, పక్కీరయ్య, గౌస్, కృష్ణారెడ్డి, ఏఓ అబ్దుల్ హక్, ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, ఏపీఓ అనీఫా, ఏపీఎం విజయగోపాల్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా

అవుకు: జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం అవుకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రూ.13లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంగళవారం ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోనే రెవెన్యూ, ఎమ్మార్సీ, అవుకు-2,3 సచివాలయాలు, ఎన్ఆర్ఈజీఎస్, వైకేపి, భవిత పాఠశాల, ఐటిఐ కళాశాల ఉన్నందును వాటర్ ప్లాంట్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే మండలంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటిని అందించటానికి రూ.8.5కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటికే 7592 కుళాయి కనెక్షన్లకు గాను 7061 కనెక్షన్‌లు,7 ఓహెచ్ఆర్‌లకు గాను మూడింటిని, 34 ఆర్ఓ ప్లాంట్‌లకు గాను 25 నిర్మించామని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు, యువ నాయకుడు కాటసాని ఓబుల్ రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, సర్పంచ్ మందా గుర్రమ్మ, జేసీఎస్ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం, నాయకులు చల్లా విక్రాంత్ రెడ్డి, రామన్న, కంపిలి నారాయణ, పురుషోత్తం నాయుడు, చిన్న కంబగిరిస్వామి, మేకల ఈశ్వర్ రెడ్డి, కేఎస్ పల్లె శ్రీనివాస రెడ్డి, ఉప్పలపాడు వెంకటేశ్వర్లు, మూరబోయిన మనోహర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రజా రవాణా సమస్యలపై బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. డిపో పరిధిలోని ఆయా రూట్లలో నడిపే బస్సు సర్వీసులు, ఏవైనా సమస్యలు, సూచనలు, సలహాలను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో తెలియజేయాలన్నారు. 9959225798 నంబర్‌కు ఫోన్‌చేసి డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నుంచి మండలస్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సోమశేఖర్, మండల స్పోర్ట్స్ కన్వీనర్ వెంకట్ నాయక్ తెలిపారు. అండర్-14,అండర్-17 విభాగంలో ప్రారంభించే ఈ పోటీలకు మండలంలోని అన్ని పాఠశాలలనుంచి విద్యార్థులు హాజరవుతారన్నారు. ఈ మేరకు మంగళవారం ఆటల పోటీల ప్రారంభోత్సవానికి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డిని వారు ఆహ్వానించారు. కార్యక్రమంలో హెచ్ఎం బ్రహ్మం, ఉపాధ్యాయులు హరికృష్ణ, వెంకటేశ్వర్లు నాయక్, పీఈటీలు రఘునాథ్‌రెడ్డి, హరి పాల్గొన్నారు.

బాబు.. పాపాల భైరవుడు

- ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును తాకట్టు పెట్టాడు
- స్కిల్ కుంభకోణంతో యువత భవిష్యత్ అంధకారం
- స్కామ్‌లతో కోట్లు దండుకున్న బాబు
- సమావేశంలో ఏపీఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజ



సమావేశంలో మాట్లాడుతున్న కర్రా దంపతులు

కోవెలకుంట్ల: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాపాల భైరవుడని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కోవెలకుంట్లలోని స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 45 సంవత్సరాల రాజకీయ ఇండస్ట్రీ అని గొప్పలు చెప్పుకునే బాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌ను తాకట్టుపెట్టారని ఆరోపించారు. విడిపోయిన రాష్ట్రానికి ఒక అనుభవం ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి అయితే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని 2014 ఎన్నికల్లో ప్రజలు బాబుకు పట్టం కడితే... రాష్ట్ర ప్రయోజనాల పేరుతో ఎన్నో స్కామ్‌లు చేసి కోట్లాది రూపాయాలు దండుకుని ప్రజలకు తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంతో చదువుకున్న యువత భవిష్యత్‌ను నాశనం చేసి వారి జీవితాలను అంధకారంలోకి నెట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. నీతి, నిజాయితీకి మారుపేరు అని గొప్పలు చెప్పుకునే బాబును స్కిల్‌స్కాంలో అరెస్ట్ చేసేందుకు సీఐడీ అధికారులు రాగా నామీద అభియోగం మోపారని, నిర్దోషిగా బయటకు వస్తానని హుందాగా వ్యవహించాల్సిందిపోయి సీఐడీ అధికారులు, పోలీసులు, ప్రభుత్వంపై దబాయింపుగా వ్యవహరించడమేమిటని ప్రశ్నించారు. స్కిల్ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయిన బాబుకు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ మద్దతు ఇవ్వడం విడ్డూరమన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



హోరాహోరీగా కబడ్డీ పోటీ సాగుతున్న దృశ్యం



కబడ్డీ ఆడుతున్న దృశ్యం

కోవెలకుంట్ల: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని ఎంఈఓ వెంకట్రామిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మంగళవారం మండలస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలను నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, వాలీబాల్, బాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నారు. మండలంలోని రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్, పట్టణంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థినీలు కబడ్డీ, పట్టణ శివారులోని గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినీలు బాల్‌బాడ్మింటన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలుర విభాగ కబడ్డీ పోటీల్లో సత్తా చాటి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 వెంకటసుబ్బయ్య, హెచ్ఎం రాజయ్య, వ్యాయామా ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చదవుతో పాటు క్రీడల్లో రాణించాలి

సంజామల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ ఈశ్వరయ్య సూచించారు. మంగళవారం పేరుసోముల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్ 14,17 బాలికల మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. ఎంఈఓ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఎంపిక అయిన క్రీడాకారులు మండల స్థాయిలో పోటీ పడ్డారన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడకారులు నియోజకవర్గంలో స్థాయిలో అడుతారన్నారు. కార్యక్రమంలో పేరుసోముల ప్రాధాన ఉపాధ్యాయురాలు సీతారావమ్మ, పాఠశాల కమిటీ చైర్మన్ గౌడ్, మండల క్రీడా సమన్వయకర్త బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలు ముఖ్యమే

అవుకు: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ముఖ్యమేనని ఎంఈఓ శ్రీధర్‌రావు అన్నారు. అవుకు పట్టణ సమీపంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో మంగళవారం మండల స్థాయిలో అండర్-17, అండర్-14 బాలబాలికలకు నిర్వహించే క్రీడా పోటీలను ఎంఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వెంకటేశ్వర రెడ్డి, ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ సుమలత, నియోజకవర్గ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, హెచ్ఎంలు చెన్నకేశ్వరి, శింగయ్య, పీడీ మాస్టర్లు పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: కేంద్రం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని చేతి వృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంగన్న, డోన్ ఇండస్ట్రీయల్ అధికారి డానియేలు ఆధ్వర్యంలో విశ్వకర్మ సమ్మాన్ యోజన పథకాన్ని ఈనెల 17న ప్రధాని ప్రారంభించనున్న నేపథ్యంలో చేతివృత్తుల వారికి, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పూర్వం వృత్తిగా కొనసాగిస్తున్న హస్త కళాకారులు పీఎం విశ్వకర్మ పథకానికి అర్హులన్నారు. విశ్వకర్మ పథకం కింద 15 రోజుల శిక్షణ తోపాటు రోజుకు రూ. 500, శిక్షణ అనంతరం రూ.15వేల విలువగల టూల్ కిట్ తో పాటు మొదటి విడత రూ. 1లక్ష లోను, 2వ విడతలో రూ. 2లక్షల లోన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో మండలానికి మంజూరైన ఎంఎస్ఎంఈ ఇనిస్టిట్యూట్ నిర్మాణం జరుగుతుందని, రానున్న రోజుల్లో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఇక్కడ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



బిజనవేములలో లబ్ధిదారులకు నగదు అందజేసిన ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి

కోవెలకుంట్ల: మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో సెప్టెంబర్ నెలకు సంబంధించి కొత్త పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. మండలానికి కొత్తగా 322 కొత్త పింఛన్లు మంజూరు కాగా ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు నగదు అందజేశారు. బిజనవేములలో ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి, ప్రతాప్‌రెడ్డి, కంపమల్ల, లింగాల, సొదరదిన్నె, అమదాల గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు లోకేశ్వరరెడ్డి, డీవీ శేషిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బాలమద్దిలేటి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

ఆధ్యాత్మికం



బోనం తీసుకెళ్తున్న కాటసాని జయమ్మ

గంగమ్మకు బోనాలు

బనగానపల్లె : శ్రావణమాసం సందర్భంగా బనగానపల్లె పట్టణంలోని తెలుగుపేటలో ఉన్న గంగమ్మ తల్లికి మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరినట్లు కాటసాని జయమ్మ తెలిపారు. అదేవిధంగా తెలుగుపేట మహిళలు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

వరుణుడు కరుణించాలని ప్రత్యేక పూజలు

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో పోతురాజు స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోయ సంఘం ఆధ్వర్యంలో వర్షం కురువాలని కోరుతూ బోనాలు సమర్పించారు. గత నెలలో గ్రామస్తులు వర్షాలు పడాలని గంగమ్మకు బోనాలు సమర్పించారు. గంగమ్మకు బోనాలు సమర్పించిన తర్వాత పోతురాజు స్వామికి కూడా సమర్పించాలనే ఆనవాయితీ ఉంది. కార్యక్రమంలో బోయ సంఘం సభ్యులు బోయ కంబగిరి, బోయ రవి, శ్యాముడు, శివ, నూరన్న, మధు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పుట్లూరు మారెమ్మ విగ్రహానికి గ్రామోత్సవం

డోన్ టౌన్ : మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన పుట్లూరు మారెమ్మ అవ్వకు మంగళవారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తి శ్రద్ధలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామస్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా గ్రామోత్సవం

కోవెలకుంట్ల: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పుష్కరించుకుని పట్టణంలో ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి వేడుకలను నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా మంగళవారం శ్రీకృష్ణుని విగ్రహాన్ని పుర వీధుల గుండా ఊరేగించారు. ముందుగా పూజా మండపంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 14వ తేదీతోఉత్సవాలు ముగుస్తాయని సేవాసమితి అధ్యక్షుడు జనార్దన తెలిపారు.



శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మెట్టుపల్లె ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

ప్యాపిలి : మండల పరిధిలోని మెట్టుపల్లెలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహానికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ముగింపు వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లేశ్వరయ్య, కృష్ణ, మదనకృష్ణ, శివశంకర్, మనోహర్, నాగరాజు, రాజు, రమేష్ పాల్గొన్నారు.

ప్రారంభమైన పెద్దరాజు స్వామి దర్గా ఉరుసు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీఠాధి పతి

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లెలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన పెద్ద రాజుస్వామి ఉరుసు గంధం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పెద్దరాజు స్వామి దర్గాను ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. నగరాతో ఉరుసు వేడుకలను దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ ప్రారంభించారు. భక్తులకు అన్నదానం చేశారు.

24న మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు

బనగానపల్లెరూరల్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా బనగానపల్లె జమా అతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 24న మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు జమా అతె ఇస్లామి హింద్ సభ్యులు మంగళవారం తెలిపారు. పట్టణంలోని ఖాన్ రైస్ మిల్ మస్జీద్ ఆవరణలో జరిగే ఈ పోటీలకు 15 నుంచి 25 ఏళ్లలోపు కులమతాలకు అతీతంగా యువతీ, యువకులు మాత్రమే అర్హులన్నారు. పోటీలో పాల్గొనే వారు ముందుగా ఈ నెల 17వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎ రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున బహుమతులు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

డోన్ టౌన్ : ఈ నెల 18 నుంచి 22 వరకు జరుగు ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్ట బద్ధత కల్పించాలని ఎమ్మార్పీస్ జాతీయ అధికార ప్రతినిధి గుండాల ఈశ్వరయ్య మాదిగ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాయం మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. దీక్షలో ఎమ్మెస్పీ జిల్లా కో కన్వీనర్ పులికేశవయ్య, ఎమ్మార్పీస్ జిల్లా ఉపాధ్యక్షులు చినరాయుడు, పట్టణ అధ్యక్షుడు సురేంద్రమాదిగ, నాయకులు దాసు, మాదన్న, లక్ష్మన్న, రామచంద్రుడు, కంబగిరి, రాము తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పేండేకల్లు గ్రామానికి చెందిన ఎర్రమల కొడుకు యువకుడు మహేంద్ర(20) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎక్కడ చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం గ్రామ సమీపాన ఉన్న చెరువు దగ్గర చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకొని చూడగా అప్పటికే మహేంద్ర మృతి చెందాడు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె : పట్టణంలోని స్వగృహంలో మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి 16 మందికి మంజూరైన రూ.16.35లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు నియోజకవర్గంలో 19 విడతలుగా 883 మంది లబ్ధిదారులకు రూ.5.25 కోట్ల చెక్కులను పంపిణీ చేశామని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీతోపాటు ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులకు ఎం శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి



మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ బుగ్గన

బేతంచెర్ల: కులమతాలకు పార్టీలకు అతీతంగా పేదలందరికీ ప్రభుత్వ ఫలాలు అందజేస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని యంబాయి మజార గ్రామాలైన మండ్లవానిపల్లె, రుద్రవరంలో ఎంపీడీఓ వెంగన్న, సర్పంచ్ యుగంధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎంపీపీ అందజేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో మరోమారు పట్టం కట్టాలని కోరారు. రెండు గ్రామాల్లో ప్రధానంగా విద్యుత్ సమస్యతో పాటు, సీసీ రోడ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయా గ్రామాల్లో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఎంపీపీ, సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖరయ్య, గూని నాగరాజు, తిరుమలేశ్వర్‌రెడ్డి, గాజుల నాగేషు, మౌలాలీ, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, జనార్దన్, బాలుడు, వెంకట్రాముడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ రూరల్ : గ్రామాలలోని ప్రజలు అందరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసు కోవాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, పంచాయతీ కార్యదర్శిలకు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ ప్రభాకర్ ఆధ్వర్యంలో సమావేశంలో నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఇంటింటికీ తిరిగి వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 16 రకాల పరీక్షలు చేయాలని సూచించారు. అనారోగ్యంగా ఉన్న వారికి తగిన మందులు ఉచితంగా ఇవ్వాలన్నారు.

ప్యాపిలి : ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ నుంచి చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్యాపిలి వైద్యాధికారిణి వాణిశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 14వ తేదీ వరకు వలంటీర్లు ఇంటికీ తిరిగి ఆరోగ్యశ్రీ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలపై ప్రచారం నిర్వహిస్తారన్నారు. 15వ తేది నుంచి వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్య సమస్యల గుర్తించి అక్కడే పరీక్షలు నిర్వహించి టోకెన్లు అందజేయాలని సూచించారు. ఈ నెల 30వ తేదీ నుంచి హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేసి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయకుమారి, రాఘవేంద్రగౌడ్, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

డోన్ టౌన్ : ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను సద్వినియోగం చేసుకుంటే ఆర్థిక మోసాల బారిన పడకుండ జాగ్రత్తలు తీసుకోవచ్చని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్సఫర్మేషన్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆర్బీఐ ఆదేశాల మేరకు కెనరా బ్యాంక్ సహకారంతో జిల్లాలో 8 కేంద్రాల ఏర్పాటు చేస్తున్నామన్నారు. డోన్, బేతంచెర్ల, వెల్దుర్తి మండలాలకు కలిపి డోన్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేంద్రంలో కౌన్సిలర్లు వివిధ గ్రామాల్లో సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ పథకాలపై ,డిజిటల్ బ్యాకింగ్, ప్రైవేట్ ఆర్థిక మోసాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారన్నారు.